సాక్షి ఏలూరు

సోమవారం : 18 : మార్చి : 2024



సమరానికి సిద్ధం

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. 8లో



పెద్దింట్లమ్మ ఆలయం కిటకిట

కొల్లేటికోటలో పెద్దింట్లమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సాయంత్రం)	సహరి మంగళవారం (ఉదయం)
ఏలూరు	6.21	4.47
భీమవరం	6.20	4.50

న్యూస్‌రీల్

కట్టుదిట్టంగా కోడ్

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు (మెట్రో) : సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినతరం చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఎన్నికల కోడ్ అమలు, సి-విజిల్, సువిధ యాప్, కంట్రోల్ రూం నిర్వహణ తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో జేసీ బి.లావణ్య వేణితో సమీక్షించారు. సి-విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులపై 100 నిమిషాల్లో స్పందించాలన్నారు. సువిధ యాప్ ద్వారా ఎన్నికల ప్రచారాలు, తదితరాలకు అనుమతులను ఆన్‌లైన్ ద్వారా ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు తదితర ముద్రణకు ముందస్తు అనుమతులు తప్పనిసరి అని, ఈ మేరకు జిల్లాలోని ప్రింటర్స్ యాజమాన్యాలకు మార్గదర్శకాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఎన్నికల సంసిద్ధతపై..

ఎన్నికల సంసిద్ధత తదితర అంశాలపై విజయవాడలోని కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, డీఆర్వో డి.పుష్పమణి హాజరయ్యారు.

'స్పందన' రద్దు

ఏలూరు(మెట్రో): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

టెన్త్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, ముఖ్యంగా ప్రశ్నాపత్రాల లీకేజీ జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు డి.దేవానందరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ప్రశ్నాపత్రంపై యూనిక్ కోడ్ ముద్రించామని, లీకైతే సులభంగా వివరాలు తెలుస్తాయన్నారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాకుండా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 31 నుంచి ఏప్రిల్ 8 వరకు జవాబుపత్రాల మూల్యాంకనం నిర్వహిస్తామన్నారు. స్థానిక కేపీడీటీ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎల్.శ్రీకాంత్, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.నరసింహారావు, కేపీడీటీ కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ప్రేమ్‌చంద్ ఆయన వెంట ఉన్నారు.

నేటినుంచి ఇంటర్ మూల్యాంకనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకాన్ని సోమవారం నుంచి ప్రారంభించనున్నట్టు జిల్లా వృత్తి విద్యాధికారి, ఇంటర్మీడియెట్ పరీక్షల ఏలూరు జిల్లా కన్వీనర్ బి.ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమయ్యే మూల్యాంకనంలో ఇంగ్లిష్, తెలుగు, హిందీ, గణితం, సివిక్స్ సబ్జెక్టుల పేపర్ల మూల్యాంకనం నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి కళాశాల నుంచి ఆయా సబ్జెక్టులకు నియమించిన ఎగ్జామినర్లను ప్రిన్సిపాళ్లు తప్పనిసరిగా మూల్యాంకనానికి హాజరయ్యేలా విధుల నుంచి రిలీవ్ చేయాలని ఆదేశించారు. ఎగ్జామినర్లు అందరూ ఉదయం 10 గంటలకు ఏలూరులో రిపోర్టు చేయాలని సూచించారు. రిపోర్ట్ చేయని ఎగ్జామినర్లు పనిచేసే కళాశాల యాజమాన్యానికి రోజుకు రూ.1,000 చొప్పున జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఆదివారం జరిగిన గ్రూప్-1 పరీక్షలకు సుమారు 62.85 శాతం మంది హాజరయ్యారని, పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు జేసీ బి.లావణ్యవేణి ప్రకటనలో తెలిపారు. ఐదు కేంద్రాల్లో 4,371 మంది అభ్యర్థులకు ఉదయం 2,747 (62.85 శాతం), మధ్యాహ్నం 2,732 (62.50 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. వట్లూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఉదయం 1,214 మంది, మధ్యాహ్నం 1,210 మంది, సీఆర్ రెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఉదయం 322 మంది, మధ్యాహ్నం 321 మంది, సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 563 మంది, మధ్యాహ్నం 562 మంది, రామచంద్ర ఇంజనీరింగ్‌లో ఉదయం 498 మంది, మధ్యాహ్నం 491 మంది, సీహెచ్ఎస్‌డీ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో ఉదయం 150 మంది, మధ్యాహ్నం 148 మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

ప్రగతి దారులు



పెనుగొండ - మార్టేరు రోడ్డు

3 కిలోమీటర్లు | రూ.4 కోట్ల వ్యయం



కవిటం - గుమ్ములూరు రోడ్డు

7 కిలోమీటర్లు | రూ.3 కోట్ల వ్యయం



కృష్ణాయపాలెం - నందమూరు రోడ్డు

9 కిలోమీటర్లు | రూ.6 కోట్ల వ్యయం

రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. గత టీడీపీ హయాంలో నాణ్యతాలేమితో నిర్మించిన పలు రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారగా వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంది. తరచూ మరమ్మతులకు గురవుతున్న రహదారులను పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లుగా తీర్చిదిద్దింది. ఇలా జిల్లాలో రాష్ట్ర, జిల్లా, పల్లె రహదారులను నిర్మించింది. ఇప్పటికే పలు రోడ్ల నిర్మాణాలు పూర్తికాగా మిగిలిన చోట్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లాలో గత 58 నెలల కాలంలో సుమారు 3,512 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించారు. ఇందుకు గాను వందలాది కోట్ల రూపాయలను వెచ్చించారు. అంతటా రహదారులను అభివృద్ధి చేయడంతో ప్రయాణం సుఖవంతంగా సాగుతోంది. దీనిపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– భీమవరం

అభివృద్ధికి బాటలు

- ఆర్అండ్‌బీ రోడ్లకు మహర్దశ
- రాష్ట్ర, జిల్లా రహదారులతో పాటు పల్లె రోడ్లకు మోక్షం
- సుమారు 3,512 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం
- హాయిగా సాగుతున్న ప్రయాణం



పెంటపాడు - వెంకట్రామన్నగూడెం రోడ్డు | 16 కిలోమీటర్లు | రూ.15 కోట్ల వ్యయం



అత్తిలి - కోరుకొల్లు రోడ్డు

14 కిలోమీటర్లు | రూ.32 కోట్ల వ్యయం



మంచిలి - మోగల్లు రోడ్డు

5 కిలోమీటర్లు | రూ.2.50 కోట్ల వ్యయం



మార్టేరు - అత్తిలి రోడ్డు

14 కిలోమీటర్లు | రూ. 25 కోట్ల వ్యయం



భీమవరం మండలంలో లోసరి రోడ్డు

11 కిలోమీటర్లు | రూ.7 కోట్ల వ్యయం



పెనుమంట్ర - వీరవాసరం రోడ్డు

300 మీటర్లు | రూ. 1 కోటి వ్యయం



ఆకివీడు - సిద్ధాపురం రోడ్డు

6 కిలోమీటర్లు | రూ.40 లక్షల వ్యయం

మరోసారి ముఖ్యమంత్రిగా జగనే

ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: రానున్న ఎన్నికల్లో ఊహించని స్థాయిలో అత్యధిక సీట్లు కైవసం చేసుకుని మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టనున్నారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు 13వ డివిజన్ మరడాని రంగారావు కాలనీ రామాలయం సమీపంలోని సూరిశెట్టి రామకృష్ణ నివాసం వద్ద ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 13వ డివిజన్ కార్పొరేటర్ నీడికొండ అన్నపూర్ణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు నిడికొండ నరేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదైన నేపథ్యంలో పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ 58 నెలల కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని కోరారు. టీడీపీ హయాంలో ఏలూరులో చేసిందేమీ లేదనీ, కనీసం ఒక్కరికైనా గజం స్థలాన్ని కూడా ఇవ్వలేదన్నారు. అయితే నేడు టీడీపీ, జనసేన నేతలు తాము అధికారంలోకి వస్తే ఏదో చేస్తామంటూ కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధపడుతున్నారని విమర్శించారు. ప్రజలు టీడీపీ మోసపూరిత వాగ్దానాలు, హామీలను నమ్మవద్దని హితవుపలికారు. 2019 ఎన్నికల్లో చెప్పినట్టుగానే సీఎం జగన్ మేనిఫెస్టోను పక్కాగా అమలు చేశారనీ, ఆయన మాట ఇస్తే కచ్చితంగా చేస్తారనే విశ్వాసం ప్రజల్లో బలంగా ఉందన్నారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, క్లస్టర్-1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏలూరులో 13 డివిజన్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

గెలుపుపై ఆశలు లేకే బాబు పొత్తులు

హోం మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో గెలుపుపై ఆశలు లేవని, అందుకే జనసేన, బీజేపీలతో పొత్తులు పెట్టుకున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని వేంపాడు, పంగిడిగూడెం గ్రామాల్లో ఆదివారం ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధమని అన్నారు. రాష్ట్రంలో కులమతాలకు తావులేకుండా పార్టీరహితంగా అర్హులందరికీ సంక్షేమం అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించే బాధ్యత పార్టీ నేతలు, కార్యకర్తలపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని, లేకుంటే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతల మాయమాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు హితవు పలికారు. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన, ఇవ్వని హామీలను సీఎం జగన్ అమలు చేశారన్నారు. మన బిడ్డల భవిష్యత్ బాగుండాలన్నా, పేదల తలరాతలు మారాలన్నా మళ్లీ జగనన్న సీఎం కావాలని అన్నారు. గోపాలపురం ఆడపడుచునైన తనను భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం రంజాన్ పర్వదినాలను పురస్కరించుకుని మెట్టపంగిడిగూడెంలోని మసీదులో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, మండల జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ తదితరులు ఉన్నారు.



శ్రీవారి సేవలో..

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని మంత్రి వనిత సందర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

క్లుప్తంగా

కన్న కూతురిపై తండ్రి అత్యాచార యత్నం

ఆగిరిపల్లి: మండలంలోని కొమ్మూరులో కన్న కూతురిపై తండ్రి అత్యాచారయత్నం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. బాలిక చదువు మానేసి ఇంట్లో ఉంటోంది. శనివారం రాత్రి మద్యం మత్తులో తండ్రి ఇంటికి రాగా, ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న కుమార్తెపై అత్యాచారానికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో ఇంటి పక్కన చుట్టుపక్కల వారు రావడంతో తండ్రి పారిపోయాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

కైకలూరు: పట్టణంలోని విద్యాంజలి కళాశాల సమీపంలో గట్టు వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు ఆదివారం చెప్పారు. నిందితుల నుంచి రూ.8,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

పెదవేగి: రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. చక్రాయగూడెంకు చెందిన బొట్ల వీరమ్మ శనివారం రాత్రి గ్రామంలో ఉన్న ఏలూరు – జంగారెడ్డిగూడెం రహదారిని దాటుతోంది. ఇంతలో జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఆమెను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి


సుకన్య మృతదేహం

కొయ్యలగూడెం: బైక్‌పై భర్త, కుమారుడితో కలిసి వెళుతుండగా, వెనుక నుంచి గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో ఓ వివాహిత అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఉద్దగిరి సుకన్య (26) ద్విచక్ర వాహనంపై తన భర్త, కుమారుడితో జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి కొయ్యలగూడెం వైపు వస్తోంది. బయ్యనగూడెం సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని లారీ సుకన్య తలమీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో భర్త, కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనకు సంబంధించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమరానికి సిద్ధం

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల నియమావళిని అనుసరించి జిల్లాలో కోడ్ అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్


విగ్రహాలకు ముసుగులు వేస్తున్న అధికారులు

- సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలతో అమలులోకి కోడ్
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం, కోడ్ అమలులో నిమగ్నం
- ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

పోలింగ్ కేంద్రాల వివరాలు

మొత్తం పోలింగ్ స్టేషన్లు	1,743
పట్టణ ప్రాంతాల్లో	320
గ్రామీణా ప్రాంతాల్లో	1423
క్లిష్టమైన పోలింగ్ స్టేషన్లు	415

ఏలూరు (మెట్రో): గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 నియోజకవర్గాలు ఉండగా, ప్రస్తుతం జిల్లాల విభజన అనంతరం ఏలూరు జిల్లాలో ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఏడు నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమించి ఆయా నియోజకవర్గాల వారీగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు నుంచి పోలింగ్ జరిగే తీరు, పటిష్టభద్రత, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు, కౌంటింగ్ ప్రక్రియ, ఎన్నికల ఫలితాల విడుదల వరకు ఏర్పాట్లను పకడ్బందీగా జిల్లా అధికారులు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఆయ పోలింగ్ కేంద్రాలకు పంపేందుకు కంట్రోల్ యూనిట్లు 4,406, బ్యాలెట్ యూనిట్లు 5,494, వీవీ ప్యాట్‌లు 5,254 అధికారులు సిద్ధం చేశారు.

నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలు..

ఏలూరు నియోజకవర్గంలో 212, దెందులూరులో 239, ఉంగుటూరులో 214, చింతలపూడిలో 273, పోలవరంలో 284, నూజివీడు 286, కైకలూరు నియోజకవర్గంలో 239 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. అన్ని పోలింగ్ బూత్‌లలో విద్యుత్, ర్యాంప్, మంచి నీటి సౌకర్యం కల్పిస్తున్నారు.

ఎన్నికల అధికారులు ఇలా

జిల్లా ఎన్నికల నోడల్ అధికారులకు 16 మంది విధులు నిర్వహించనుండగా, సెక్టార్ అధికారులను 193 మంది నియమించారు. అలాగే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు మొత్తం 10,458, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ 30, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 34, వీడియో నిఘా బృందాలు 30, వీడియో వీక్షణ బృందాలు 8, అకౌంటింగ్, వ్యయ బృందాలు 8 మందిని నియమించారు. 15 వేల మంది వరకు పోలీసులు విధుల్లో భాగం కానున్నారు.

ఎన్నికల సహాయ అధికారుల వివరాలు

జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల పరిధిలో సహాయ ఎన్నికల అధికారులను సైతం జిల్లా ఎన్నికల అధికారి నియమించారు. దెందులూరు నియోజకవర్గానికి ఏలూరు జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, ఏలూరు నియోజకవర్గానికి ఎస్‌డీసీ ఎం.ముక్కంటి, ఉంగుటూరు నియోజకవర్గానికి ఏలూరు ఆర్డీవో ఖాజావల్లి, పోలవరం నియోజకవర్గానికి ఐటీడీఏ పీవో సూర్యతేజ, చింతలపూడి నియోజకవర్గానికి జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య, కైకలూరు నియోజకవర్గానికి ఎస్‌డీసీ కె.భాస్కర్, నూజివీడు నియోజకవర్గానికి ఆర్డీవో వై.భవానీ శంకరీలను నియమించారు.

కంట్రోల్ రూమ్‌లు

- ఎన్నికల నేపథ్యంలో సమాచారం, ఫిర్యాదులు తదితర వాటి కోసం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.
- వెబ్ పోర్టల్ – నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ)
- మొబైల్ యాప్ సీ–విజిల్ యాప్
- ఓటర్ హెల్ప్‌లైన్ నంబర్ 1950 (టోల్‌ఫ్రీ)
- జిల్లా స్థాయిలో సమాచారం సేవల కోసం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ నంబర్ 1800 233 1077 ఏర్పాటు

విగ్రహాలకు ముసుగు

ఇదిలా ఉండగా, జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎక్కడికక్కడే విగ్రహాలకు ముసుగులు వేసి, ఫ్లెక్సీలు తొలగించే చర్యల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఎక్కడా పార్టీలకు అనుకూలంగా అధికారులు విధులు నిర్వహించరాదని, కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు చేయాలి


రాజకీయ బ్యానర్ తొలగిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: జిల్లాలో ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలు చేయాలని డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కైకరంలో జాతీయ రహదారిపై ఉన్న విగ్రహాలకు ఆయనే ముసుగు కప్పి కోడ్‌ను అమలుచేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో నిబంధనలు అతిక్రమిస్తే వేటు తప్పదని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియామావళి అమలులోకి వచ్చిందన్నారు. జాతీయ రహదారిపై విగ్రహలకు కప్పిన విధానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కోడ్‌కు లోబడి నాయకుల విగ్రహలను మూసివేసే సందర్భంలో తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని సూచించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో జిల్లాలో ఎన్నికల కోడు అమలుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల కోడ్‌కు అడ్డుగా ఉన్న రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగించామన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రభుత్వ ఉద్యోగులు ప్రవర్తించరాదని, నియమావళికి లోబడి పనిచేయాలన్నారు. దీనిని అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవన్నారు. మండల పంచాయతీ విస్తరణాదికారి షంషుద్దీన్, పంచాయితీ కార్యదర్శి నాగేంద్ర ఉన్నారు.

ఎన్నికల కోడ్ అమలుకు కృషి

బుట్టాయగూడెం: జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్‌ను పగడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ పీఓ, పోలవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కోడ్ అమలులో భాగంగా ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ టీమ్‌లు ఆదివారం ప్రభుత్వ, ప్రైవేటు ప్రాంతాల్లో ఉన్న పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్స్, గోడ పెయింటింగ్‌లను తొలగించామన్నారు. నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో 1,654 పోస్టర్లు, 1,229 బ్యానర్లు, 512 హోర్డింగ్స్, 383 ఇతర, గోడ పెయింగ్స్ వంటివి తొలగించినట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిమిత్తం ఎటువంటి ఫిర్యాదులు ఉన్నా పోలవరం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సెంటర్ ఫోన్ నంబర్ 08821–23221 కు తెలియజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

కిటకిటలాడిన పెద్దింట్లమ్మ ఆలయం


అమ్మవారి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు


కొల్లేటికోటి పెద్దింట్లమ్మ తల్లి

కైకలూరు: పెద్దింట్లమ్మ నామస్మరణతో కొల్లేటికోట మార్మోగింది. ఆదివారం సెలవు దినం కావడంతో సమీప జిల్లాల నుంచి 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సమీప కోనేరులో స్నానాలు ఆచరించిన భక్తులు అమ్మకు వేడి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కేశఖండనశాల వద్ద రద్దీ కనిపించింది. పలువురు జల్లు స్నానాలు ఆచరించారు. భక్తులు వంటలు చేసుకోడానికి దేవదాయశాఖ టెంట్లను ఏర్పాటు చేసింది. విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాదం, మజ్జిగను ఆర్జమూరుకు చెందిన సింగలూరి అంజయ్య, వాటర్ ప్యాకెట్లు, పసిపిల్లలకు పాలు పంపిణీ గణపవరానికి చెందిన పిన్నమరాజు వెంకట సీతారామరాజు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిల్లరకొట్టు చిట్టెమ్మ సాంఘిక నాటకం ఆకట్టుకుంది. అమ్మవారికి షష్ఠ్యావరణ కలశార్చన, షష్ఠ్యావరణపూజ, విశేషార్చన, పుష్పాలంకరణ ధూపసేవ, బాలభోగం, సాయంత్రం పంచహారతులును అర్చకులు అందించారు. అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదానికి విజయవాడకు చెందిన కొయ్య వెంకటేశ్వరరావు దంపతులు దాతలుగా వ్యవహరించారు. రూరల్ సర్కిల్ సీఐ బి.కృష్ణకుమార్, రూరల్ ఎస్సై టి.రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

21న అమ్మవారి కల్యాణం

కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో కీలకఘట్టమైన జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామివార్ల కల్యాణం ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కేవీ గోపాలరావు చెప్పారు. అదే రోజున ప్రభల బండి, బోనాల గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున విచ్చేయాలని కోరారు.

మళ్లీ వచ్చేది జగన్ ప్రభుత్వమే

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ధీమా


ఎమ్మెల్యే ఆళ్ల నానిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలనే కాక అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేసిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో మరోసారి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఆళ్ల నానిని అధికారికంగా ప్రకటించడంపై పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు అంతా హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం నానిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు, మెమెంటోలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని తెలియజేస్తూ 175కి 175 సీట్లు గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా రూ.100 కోట్లు సంక్షేమ నిధిని కేటాయించి నిధులను విడుదల చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. నూతనంగా ప్రాక్టీసులోకి వచ్చిన న్యాయవాదులకు లా నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి నెలా రూ.5 వేల చొప్పున మూడేళ్ల పాటు స్టైఫెండ్ ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. కరోనా సమయంలో ఉపాధి కోల్పోయిన న్యాయవాదులకు కోవిడ్ రుణాలు అందించి ఆదుకున్న ఏకైక ప్రభుత్వం తమదని చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కోనే సీతారామ్, ఆచంట వెంకటేశ్వరరావు, డీపీ రామాంజనేయులు, ప్రభుత్వ ప్లీడర్ బి.జగన్నాథరెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ప్రత్తిపాటి తంబి, జెడ్పీ స్టాండింగ్ కౌన్సిల్ స్టాన్లీ బాబు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిన్నం సుధీర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట సుధీర్, లీగల్ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షులు పితాని దుర్గాప్రసాద్, నాయకులు చదలవాడ వెంకటరమణ, మోహన్‌చంద్ర, చిరంజీవి పాల్గొన్నారు.

నడిపల్లిలో చోరీ

పెదవేగి: నడిపల్లిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగి బంగారు ఆభరణాలు, వెండి, వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మేకా రమేష్ కుటుంబసభ్యులతో కలిసి వారం క్రితం హైదరాబాద్ వెళ్లారు. అయితే ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన స్థానికులు శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఉన్న రమేష్‌కు సమాచారం అందించారు. దీంతో ఆదివారం ఉదయానికి నడిపల్లి చేరుకున్న రమేష్ ఇంట్లో నాలుగు కిలోల బరువైన మూడు వెండి పళ్లాలు, ఐదు కాసుల బంగారు ఆభరణాలు, రూ.ఐదు వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వాసవీ మాతను దర్శించిన మహారాష్ట్ర భక్తులు


వాసవీ శాంతి థాంలో మహారాష్ట్ర భక్తులు

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంను మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన భక్తులు వాసవీ మాతను దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి వాసవీ శాంతి థాంలో మరకత శిల వాసవీ మాతకు అభిషేకాలు, అర్చనలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. అనంతరం దంపతుల పూజలు, వాసవీ హోమం నిర్వహించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన వాసవీ మాత పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి వ్యక్తి హల్‌చల్


తణుకులో వాటర్ ట్యాంకు ఎక్కిన వ్యక్తికి సర్దిచెబుతున్న పోలీసులు

తణుకు: పైడిపర్రులో వాటర్ ట్యాంక్ ఎక్కి ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. చివరికి పోలీసులు, ఫైర్ సిబ్బంది సర్దిచెప్పడంతో కిందకి దిగి వచ్చాడు. వివరాలిలా ఉన్నాయి. వేల్పూరుకు చెందిన యరమాటి సత్యనారాయణ పరంజా కట్టే పనులు చేస్తుంటాడు. కొమరవరం మేస్త్రి వద్ద ఏడేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తాడేపల్లిగూడెంలో పని కోసం వెళ్లిన సత్యనారాయణ మద్యం తాగి అక్కడ భవన యజమానితో ఘర్షణకు దిగాడు. దీంతో మేస్త్రి దుర్గారావుకు యజమాని ఫోన్ చేసి చెప్పడంతో సత్యనారాయణను మందలించారు. భార్య సుబ్బలక్ష్మికి సైతం విషయం చెప్పడంతో మనస్తాపం చెంది తణుకు రూరల్ పోలీసు స్టేషన్ వద్ద వాటర్ ట్యాంక్ ఎక్కాడు. దుర్గారావుతోపాటు భార్య సుబ్బలక్ష్మిని రప్పించి కిందికి వస్తే సమస్య పరిష్కరిస్తామని పోలీసులు, ఫైర్ సిబ్బంది హామీ ఇవ్వడంతో రెండు గంటల అనంతరం కిందికి దిగాడు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలెన్నో

పాడి - పంట


మెట్ట ప్రాంతంలో వేసవి దుక్కుల్లో నిమగ్నమైన రైతు

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో రానురాను వ్యవసాయ భూములకు అందాల్సిన స్థూల, సూక్ష్మపోషక పదార్థాలు తగ్గిపోతుండటంపై వ్యవసాయ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద ఎక్కువగా ఉండటం వల్ల పశువుల ఎరువు పుష్కలంగా లభించేది. దీనిని రైతులు సేంద్రియ ఎరువుగా పంటలకు వాడేవారు. క్రమేపీ వ్యవసాయ రంగంలో యంత్రాలకు అలవాటు పడడంతో రైతులు పశువుల పెంపకాన్ని తగ్గించారు. దీంతో సేంద్రియ ఎరువుకు కొరత ఏర్పడింది. ప్రత్యామ్నాయంగా రసాయన ఎరువులు వాడటం పెరిగి భూసారం దెబ్బతినడమే కాక పైరుకు అవసరమైన పోషక పదార్థాలు అందుబాటులో లేకుండా పోయాయి. దీనివల్ల దిగుబడులు తగ్గి, చీడపీడల ఉధృతి పెరగడం వంటి పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో రైతులు సరైన సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చునని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌లో ఏటా 17,500 హెక్టార్లలో వరి పంటను రైతులు సాగు చేస్తారు. పంటకాలం పూర్తయ్యాక తొలకరి వర్షాలు కురిసేవరకు భూమిని పట్టించుకోరు. దీనివల్ల భూసారం దెబ్బ తింటుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.


వేసవి దుక్కులతో చీడపీడల నివారణ

వేసవి దుక్కులతో పంటలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. సాధారణంగా రైతులు కోతలు పూర్తవగానే పొలాలను అలాగే వదిలేస్తారు. మళ్లీ తొలకరి పలకరించగానే సాగుకు సిద్ధమవుతారు. చినుకులు పడగానే దుక్కులు దున్నడం ప్రారంభిస్తారు. అలా కాకుండా వేసవిలోనే దుక్కులు దున్నడంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగకుమార్ సూచిస్తున్నారు. వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరుగుతాయి. అవి భూమిలోని నీటిని, పోషక పదార్థాల్ని గ్రహించి పెరుగుతాయి. కారణంగా భూమి లోపలి పొరల్లో నీరు హరించుకుపోతుంది. భూసారం తగ్గిపోతుంది. రైతు వేసిన పంటకు పోషకాలు లభించవు. వేసవి దుక్కుల వల్ల భూమి లోపలి పొరల్లో దాగివున్న కీటకాల గుడ్లు, శిలీంద్రాలు బయటకు వచ్చి ఎండ తీవ్రతకు నశిస్తాయి. దుక్కిలో బయటపడిన పురుగులను పక్షులు తినడం వల్ల పంటలకు చీడపీడల బెడద తప్పుతుంది.

భూసారం పెంచడం ఎలా?

భూసారాన్ని పెంచుకోవడానికి రైతులు కనీసం రెండు పంటలు వేసిన తరువాత పచ్చి రొట్ట సాగు చేయాలి. దీనివల్ల భూసారం పెరగడమే కాక చీడ పీడల బెడద తప్పి దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి. సేంద్రీయ పదార్థాలను నేలకు అందించడం, కలుపు మొక్కలను నివారించడం, నేలలో నివశించే జీవరాశులకు ఆహారంగా, మొక్కలకు కావల్సిన అన్ని పోషక పదార్థాలను అందించే సాధనాలుగా ఈ పచ్చిరొట్ట పంటలు ఉపయోగపడతాయి.

వేసవి దుక్కులతో నేల సారవంతం



భూమిని 25 నుంచి 30 సెంటీమీటర్ల లోతు వరకు దుక్కులు దున్నడం వల్ల నేలలో గాలి లభ్యత పెరిగి సూక్ష్మ జీవుల సాంద్రత పెరుగుతుంది. కర్బన పదార్థం లభ్యత పెరిగి నేల సారవంతమవుతుంది. భూమికి వాలుగా దుక్కిదున్నడంతో వర్షం కురిసినప్పుడు ఆనీరు భూమి లోపలకు ఇంకుతుంది. భూమికి నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. వాతావరణంలోని నత్రజని వర్షపు నీటితో కలిసి నేలకు చేరడంతో సారవంతంగా మారుతుంది.

– బి.నాగకుమార్, ఏడీఏ, వ్యవసాయ సబ్‌డివిజన్